# అవధాని ఆశయం

ఊహ తెలిసినప్పటి నుంచి అవధానిని ఊరిస్తున్న కోరిక నెరవేరే తరుణం రానే వచ్చింది. అరవై ఆరేళ్ల పైబడ్డ అతను విమానంలో కాలుపెట్టాడు... ఆ కుషన్ కుర్చీలో సర్దుకుని కూర్చునే సరికి... ఎంత చైతన్యం! నడుముకు బెల్ట్ బిగించుకుని ఆమెత్తని శాలువా తీసి కప్పుకున్నాడు. ఓ తీయని గొంతు పలకరించి హెడ్ ఫోన్ అందించింది. వెంటనే దాన్ని అమర్చేస్కుని, అర్థంగాని ఆ సంగీతాన్నే వింటూ ఆనందానుభూతితో తేలిపోతున్నాడు. హడావుడిగా తిరుగుతూ అందరికీ అన్నీ చిటికెలో సమకూరుస్తున్న ఆ యువతులంతా అవధాని కంటికి అప్సరసలైపోయారు. "ఓం అప్సర కామినీ సేవితాయనమః" - అప్రయత్నంగా అవధాని నోట పలికేసింది !!" ఈ నామం వేంకటేశ్వర అష్టోత్తరంలో ఎక్కడ ఉంది?" - శ్రద్ధగా వింటున్న కొందరు భక్తులు విస్తుపోయారు. అవధాని ఉలిక్కిపడ్డాడు! తనున్నది ఎక్కడ ? ఊహాలోకం నుంచి వాస్తవానికి వచ్చాడు. తను నలభైయేళ్లుగా నిష్టతో అర్చన చేస్తున్న ఇష్టదైవం వెంకటేశ్వరుని సన్నిధిలో ఇంతమంది భక్తుల చేత పూజలు చేయిస్తూ, ఛీ...ఛీ !... తన నాలుక ఇలా ఉచ్చరించిందేమిటి? అవును మరి ! మనసు గగన విహారం చేస్తోంది ! తను స్థిమితాన్ని కోల్పోతున్నాడు ! రేపో ... మాపో ... అనంత దగ్గర నుంచి ఉత్తరం రానే వస్తుంది ! తన ఊహలు నిజమై, హాయిగా అమెరికా పౌరుడై పోతాడు!!! ఆలోచిస్తూనే అర్చన పూర్తి చేయించి, ఇంటికి బయలు దేరాడు.

ఓరెండు వారాలు ఎదురు చూసాక, అనంతం దగ్గర నుంచి ఉత్తరం అందుకున్నాడు. ఆత్రంగా చదివిన తన చుట్టూ సెగలూ, పొగలూ కమ్ముకున్నాయి. హోమ గుండంలో పడిన మంచి నెయ్యిలాగ అవధాని అనాయక హృదయం దహించుకుపోయింది. తన కొడుకు అనంతం ... తన అంతులేని ఆశల రూపం - అనంతం ... తన రక్తం పంచి, జన్మనిచ్చి, వాడి కోసమే తన సర్వస్వం ధారపోస్తే - వాడికిప్పుడు తను ఎందుకూ కొరగాని వాడయ్యాడు. పురిటి కందుని తన

కప్పగించి తన భార్య అలమేలు కన్నుమూస్తే... తను కళ్లల్లో పెట్టుకుని పెంచాడు. మారుడు తల్లి వస్తే తన చిట్టి తండ్రిని ఏ బాధలు పెడుతుందో ఏమో అనేగా, తన మనస్సుని హారతి కర్పూరం లాగా కరిగించాడు ! తమని లక్ష్యపెట్టడం లేదని తన తల్లిదండ్రులు వాపోయే వారు. ముప్పైఏళ్లకే మునలితనం పై బడ్డ వాడిలా ఏవిటిరా ! యీ విరక్తి ! లక్షణంగా పెళ్లి చేసుకుని సుఖపడు ! అనంత్ నీకు కొడుకైతే మాకు మనవడు కాదా ? వాడి ఆలనా - పాలనా మేం చూసుకోమా !" అనేది అమ్మ ! " వాడికేం చెప్పినా చెవిటి వాడి చెవిలో శంఖం ఊదినట్లే ! కాకపోతే... ఆ పసి బిడ్డే లోకమైనట్టి ఊరికే ఇదైపోతున్నాడు! చూస్తున్నావుగా? ఈ మధ్య ఆలయానికి కూడా కొడుకుని చంకనేసుకునే వెళ్తున్నాడు! మరో ఆడపిల్ల, ఇల్లాలుగా అడుగుపెట్టి నట్టింట్లో దీపం పెడితే ... మనందరి బ్రతుకుల్లో చీకటి మాయమైపోదు ? ఎంత చెప్పినా వీడికి అర్థం కాదు ! అందుకే నాకు ఒళ్లు మంట నాన్న గంటల తరబడి దండకం పల్లించే వాడు ! తను పెదవి కదిపేవాడు కాదు .... కన్న వాళ్ల మాటకి విలువనిచ్చి తన జీవితంలోకి మరో ఆడదాన్ని ఆహ్వానించివుంటే ఏమైవుండేదో ? అనంతమే సర్వస్వంగా భావించాడు తను ... కనుకనే వాణ్ణి ఈ స్థితికి తీసుకురాగలిగాడు. ఇప్పుడు తన " అపురూప ప్రపంచం" లోకి తండ్రి అడుగుపెట్టడం మహాపరాధంగా భావిస్తున్నాడు వాడు. అందుకు నిదర్శనమేగా యీ ఉత్తరం ! పదే పదే చదవసాగాడు. దానిలోని కొన్ని మాటలు అవధానిని పాతాళంలోనికి తోసేస్తున్నాయి. " తను... వెర్రిబాగులవాడా ? తనదో పనికిమాలిన వృత్తా ? అక్కడ తననంతా వింత జంతువులా చూస్తారని రాస్తున్నాడే - ఎవరి వల్ల యింతటి వాడయ్యాడు ? ఆ అభిమానం రవంత కూడా లేకుండా ఏం రాశాడు ? ఒక్కోమాట అతని గుండెల్ని పిండేస్తున్నాయి ! ఊరు దద్దరిల్లి పోయేలా కంచు కంఠంతో వేద మంత్రాల పేరిట గొంతు చించుకునే మీరు వికృతంగా కనిపించే మీ పంచెకట్టు విభూధి నామాలు, రుద్రాక్షమాలలు - ఇక్కడి వాళ్లకి ఎగతాళిగా కన్పిస్తారు. వాటిన్నిటికీ తిలోదకాలిచ్చి, నా దగ్గరే వుండిపోతాననొచ్చు ! - అది కలలో మాట ! ఇక్కడ ఎవ్వరూ కూర్చుని తినరు - కలిసి బ్రతకరు. ఎవరికి వారే అన్నట్టుంటిందీ చోటు ! ఈ ఝుంఝూటం నేను పెట్టుకోను -" ఉత్తరాన్ని గిరాటేశాడు -" వీన్నిక ఛచ్చినా తలుచుకోకూడదు ! అలమేలుతో బాటే వీణ్ణికూడా మట్టిలో కలిపేశానని అనుకుంటే పోలే ?" - అతని పెదాలపై శుష్కహాసం చోటుచేసుకుంది. "అదెలా సాధ్యం ? తను కష్టపడి ఆర్జించిన ప్రతిపైసా, తన శరీరంలోని ప్రతి నెత్తురు బొట్టు వాడికోసమే వెచ్చించాడు . చివరికి కన్నవాళ్లకు కూడా దూరమైంది తన పుత్ర రత్నం మూలానే ! ... ఎంత చెప్పినా అమ్మానాన్నల మాట పెడ చెవిని పెట్టాడు.తను !" పెళ్లి పెడాకులు మానేసి ... ఇంతోటి యీ నలుసు కోసం నీ బ్రతుకు చే జేతులా నాశనం చేసుకుంటున్నావు. నువ్విలాగే అఘోరించు ! మాశేష జీవితనాన్ని అమ్మాయి దగ్గరే గడిపేస్తాం ! " - అనేసి వాళ్లు అక్క దగ్గరకే వెళ్లిపోయారు.

వాళ్ల ఆవేదన తనని ఏమైనా కదిలించలేక పోయింది. కొడుకును కాన్వెంటులో చేర్చాడు.

వాడు ముద్దు ముద్దుగా రైమ్స్ చదువుతూ ముచ్చటగా అభినయం చేస్తుంటే ఎంత మురిసిపోయాడని ! తనలా వేదమంత్రాలు వల్లిస్తూ కూర్చోడు వీడు ! గొప్ప గొప్ప చదువులు చదువుకుని ఎంతో ఎత్తుకు ఎదిగిపోతాడు. గుడిలో అర్చనలు చేయిస్తూ, "పంతులూ!" "బాపనయ్యా!" అని పిలిపించుకోడు ! కంప్యూటరు ముందు కూర్చుని తన చుట్టూ "సార్ ! సార్ !" అంటూ తనను వేలాది మంది చేత పిలిపించుకునే ఉద్యోగం చేస్తాడు. వాణ్ణి తనెలాగైనా అమెరికా పంపించి తీరుతాడు ! తను తన జీవితంలో నెరవేర్చుకోలేని ఆశయం అనంత్‌లో ప్రతిఫలిస్తుంది. అప్పుడు తన కోరికా తీరిపోదూ ?

కాసిన్ని నీళ్లుపోసి పెంచినంత మాత్రాన మొక్క పూలనిస్తుంది. నాటి, నాలుగు కాలాలూ సంరక్షణ చేస్తే, చెట్టు కమ్మని ఫలాల నిచ్చి ఆకలి తీరుస్తుంది. పాడియావు, పంటపొలం - అన్నీ అలానే - తన కోసం శ్రమించిన వారికి మనుగడ ప్రసాదిస్తాయి. అలాటిది ఇంత అభిమానంతో తన కోసం ఏమీ ఆలోచించకుండా, తన కంటూ ఏదీ మిగుల్చుకోకుండా, కొడుకుకి బంగారు బాటను ఏర్పరిస్తే వాడు తనని కళ్లల్లో పెట్టుకుని చూచుకోడూ ? అలా అనుకునే తన ఆరోగ్యాన్ని కూడా లెక్క చేయకుండా అనంతాన్ని చదివించడానికి ప్రయాసపడ్డాడు. తన దగ్గరే వుంటే తన వృత్తి వాసన ఎక్కడ అంటుకుంటుందో - అని పై వూళ్లల్లో వుంచి మరీ చదివించాడు.

తను కోరుకున్నట్లు కొడుకు విద్యావంతుడవుతుంటే అవధాని ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. తనెప్పుడో పసితనంలో అనుకునే వాడు - పెద్ద చదువులు చదువుకోవాలని ! అమెరికా వెళ్లి అక్కడే స్థిరపడిపోవాలని తండ్రి చాదస్తం ... కుల వృత్తి పట్ల తనకున్న మమకారం తనని కనీసం కాలేజీలో కూడా కాలుపెట్టనివ్వలేదు. అందుకే కొడుకు ఒక్కో మెట్టెక్కి ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నాడని ఆ తండ్రికంత సంబరం. కంప్యూటర్ ఇంజనీర్‌గా పెద్ద కంపెనీలో ఉద్యోగం సంపాదించుకుని, ఆ కంపెనీ వారి ఖర్చులతోనే అనంత్ అమెరికా వెళ్తున్నప్పుడు అవధానికి కనిపించిందీ కొండంత దేవుడు ! - తనకు కొండంత వరాన్నే అనుగ్రహించాడని ! అతని మనస్సు ఆకాశాని కెగిసింది - ఇంకేముంది ? తన ఆశయం నెరవేరిపోయినట్లే ! తన పాటికి తనని వదిలేసి, అనంత్ ఇలా హాయిగా జీవించగలడని .... ఊహించలేక పోయాడు. ఎన్ని ఆశలల్లుకున్నాడు ? ఎన్ని గాలి మేడలు కట్టుకున్నాడు ? ఇప్పుడవన్నీ నేల మట్టమైపోయాయి. ఒక్క సారిగా ఒంటరితనం, నిర్లిప్తత, అవధానిని ఆవరించాయి. నిస్సారంగా... భారంగా రోజులు నెట్టుకొస్తున్నాడు. రూపు మాసిపోయిన అతని ఆశయం విచిత్రంగా తిరిగి ఊపిరి పోసుకుంది. శివానందం వైపు నమ్మలేనట్లు చూస్తున్నాడు. "నా పిచ్చితనం తెలుసు కనుక ఆటపట్టిస్తున్నావు కదరా ! కాకపోతే మీ అబ్బాయి కపర్ది అమెరికా అమ్మాయిని ప్రేమించి అక్కడే మన సంప్రదాయం ప్రకారం పెళ్లి చేసుకోవాలను కోవడం లక్షలు ఖర్చైనా లెక్క చేయక నన్ను తీసుకుని రమ్మనడం - ఇదంతా ఎగతాళి కాదా ?" అన్నాడు తడబాటుతో అవధాని "చిన్నప్పుడు బిళ్లం గోడు ఆడుకున్న

ప్పటి నుంచి ఏనాడైనా నిన్నెగతాళి చేశానా ? తోటి పిల్లలు "నామాల బాపడు -" అని అంటూ నిన్నువెక్కిరిస్తుంటే వాళ్లందర్నీ తన్ని తరిమేసే వాడిని ! నీ మీద ఒక్క ఈగను కూడా వాలనిచ్చే వాణ్ణి కాదు కదా? అదంతా మర్చిపోయావా ? ఓరి వెర్రివాడా ! నువ్వు నాతోటే అమెరికా వస్తున్నావు. నీకు తెలుసో లేదో - మా కుటుంబంలో అందరికీ నీపట్ల ఎంతో ప్రత్యేకమైన భక్తి గౌరవాలు ! అంతకు మించి అభిమానమున్నూ ! - ఉన్నాయిరా ! అందుకనే మావాడికి నిన్ను రప్పించుకోవాలని ఇంత పట్టుదల !

అవధాని తన శ్రావ్యమైన కంఠంతో వివాహ మంత్రాలు చదువుతున్నాడు. యథావిధిగా కపర్థి పెళ్లి తంతు జరిగిపోతోంది ! తండ్రిని చూసిన అనంత్ నిశ్చేష్టుడైపోయాడు. " నాన్నా !..." అన్న రెండక్షరాలూ గొంతులోనే కొట్లాడుతున్నాయి. నోట మాట రావడం లేదు . అప్పుడు మేల్కొన్నాడు - అతనిలో పితృభక్తి - వివేకమున్నూ ! తన మనసులోని మమతలను మసి చేసిన యీ వ్యర్థ నాగరికతా వ్యామోహం పటా పంచలై పోయింది ! తనని తను మరిచి తండ్రి కాళ్ల మీద పడిపోయాడు ! " నాన్నా !... నన్ను క్షమించగలవా ?" అతి ప్రయత్నం మీద అనగలిగాడు. అవధాని మౌనంగా కొడుకును లేవదీసాడు - ముసి ముసి నవ్వులతో ముందు కొచ్చాడు కపర్థి. " ఏం మిత్రమా ! మీ నాన్నాను చూస్తాననుకోలేదు కదూ ?" " నీ మాటలతో నన్ను చిత్ర వధ చెయ్యొద్దురా కపర్థీ! నువ్వు కావాలనే ఇదంతా చేశావు. మా నాన్నను నువ్వే రప్పించి, నా చేతులతో నేను చెంపలు వాయించుకునేటట్లు చేశావు"? " అలా ఎందుకను కోవాలి? ఎవరి స్థాయిలో వాళ్లు తమ వారి చేత గౌరవాభిమానాలు పొందడానికి ఎప్పుడూ అర్హులే ! రా ! ... నీ తండ్రిని నువ్వు ఆత్మీయంగా చూసుకుంటే నాగరిక సమాజంలో తేలిక అయిపోతావేమోనని సంకోచించావు. కన్న కొడుక్కి దూరమై, జీవితాంతం కుమిలిపోయే పరిస్థితి కల్పించావు. మనదైవ భక్తినీ, మన సత్సంప్రదాయల్నీ మనమే చులకన చేయాల్సిన పనిలేదురా ! ఎప్పటికీ వాటి విలువ వాటిదే ! మీ నాన్న పురోహితుడని చిన్నతనమెందుకోయ్! అవృత్తే కదా నిన్నింతటి వాడిని చేసింది !" " నా పొరపాటు తెలుసుకున్నానురా ! అందుకేగా - నాన్నని క్షమాభిక్ష వేడుకుంటున్నాను. ..... ఇకపై నాన్న నా దగ్గరే ఉంటారు ! అందుకవసరమైన ఏర్పాట్లు నేను చేసుకుంటాను !" "వద్దుబాబూ ! నువ్వనుకుంటున్నట్లు నేను నీ దగ్గర ఉండను. శివాతోనే వెనక్కి వెళ్లిపోతాను - చివరి క్షణం వరకూ కూడా దైవార్చనలోనే గడుపుతాను !" తండ్రి మాటల్లోని దృఢ నిశ్చయం అనంత్‌ని మరేమీ మాట్లాడనివ్వలేదు. " పోనీలే ! మీ నాన్న ఇష్టమే కానీ ! అతన్ని పువ్వుల్లో పెట్టి ఇండియా పంపిస్తాను ఒక్కసారి ఈ దేశం చూసి తన ఆశయాన్ని నెరవేర్చుకున్నారుగా !" కపర్థి మాటలకు అవధాని నిండుగా నవ్వాడు. ❑